కలయచూసాడు ఎంకడు. యెక్కడా కవ్పించలేదు.

పాపం! ఎంకి గట్టిగా తలభిన్నంచేసింది గాబోలు! ఆ దెబ్బతో యింటికి పోయి వుంటాడు. సరే ఉదయాన కలుసుకుందామనుకొని ఎంక డింటికి పయనమయ్యాడు.

"ఏంబాబూ రాత్రి మీరు సినిమాపూర్తిగా చూడకుండావచ్చేసారా?" అన్నాడుఎంకడు ఆనందబాబు దర్శనం ఉదయాన దొరకగానే. "లేదురా ఉన్నట్లుండి కడుపునొప్పి తలబాధపట్టుకుంది. అంచేత నగంలోనే వచ్చేసాను. నీవుపోయి మిగిలిన చేలకు నీరు పెట్టేయ్ యీవేళ" అన్నాడు ఆనందబాబు.

"బాబూ ఈ ఉంగరం తమరిదేనా?" అన్నాడు ఉంగరాన్ని చూపిస్తూ ఎంకడు. "అరెరె! అది నీకెక్కడిదిరా? నాదే రాత్రి ఎక్కడో పడిపోయింది. కొంచంవదులుగా వుంది బిగవచేయించాలి అన్నాను రాత్రి జ్ఞాపకంతే. నాదేరా ఇలాతే!" అన్నాడు ఆతృతగా ఆనందబాబు.

"ఇదిగో తీసుకొండి! రాత్రి చెరువు గట్టున దొరికింది. అంతా ఎంకి చెప్పింది లెండి!" అన్నాడు ఎంకడు ఉంగరం యజమానికందిస్తూ.

"అంతా ఎంకి చెప్పిందిలెండి" అనటంతోటే ఆనందబాబు నిశ్చేష్టుడయిపోయాడు. ఉంగరం చెఱువుగట్టున దొరికిందనటంతోటే ఆయన కొంచం కంగారుపడ్డాడు. ఎంకి నన్ను గుర్తుపట్టేసి వీడికి చెప్పవేసిందేమిటి చెప్మా! అయితే వీడూ రాత్రి సినిమాలో లేడన్నమాట! అనుకొన్నాడు ఆనందబాబు.

ఎంకడిముఖాన్ని, ఆ ఉంగరాన్నిచూచేటప్పటికి ఆయనకు కంగారు పుట్టుకొని వచ్చింది. ఆయన రాక్షస హృదయాన్ని బలంగా ఎవరో పొడిచినట్లయింది. ముచ్చెమటలుపోసాయి, తల తిరిగింది, కాళ్లాడ లేదు. శిలాప్రతిమలా నిలబడిపోయాడు!

★

# అసలు సంగతి

రచన : రామవరపు గణేశ్వరరావు

ఒకప్పుడు స్త్రీలందరూ కలసి ఆలోచించారు. దీర్ఘంగా ఆలోచించారు. తాము పురుషుల జీవనరథానికి రెండు చక్రాల్లాటివారు. ఉభయులూ సమాన సుఖం అనుభవిస్తున్నారు. అలాగే సమానకష్టం ఎందుకు అనుభవించకూడదు? తాము నవమాసాలు మోయాలి. ఈ నవమాసాలూ నరకయాతన అనుభవించాలి. తరువాత ప్రసవవేదన! ఇది మరీఘోరం! నరకయాతనకి మించినబాధ. తమలో కొందరు ఈసమయంలో మరణించడం కూడా కద్దు. ఈ కష్టాల్లో పురుషులు భాగం పంచుకోరు. ఎందుకు పంచుకోకూడదు! తమతో సమానసుఖం అనుభవిస్తున్నవారు ఆ వచ్చే కష్టాలని కూడా సమానంగా అనుభవించాలి. ఇదీ వారికొచ్చిన సమస్య.

ఆదేశపురాణి కొంతమంది స్త్రీలు కలసి భగవంతుని ప్రార్థించి ప్రసన్నుని జేసుకున్నారు. భగవంతుడు దయామయుడు. వారి కోరిక విన్నాడు. అనుగ్రహించాడు. "పిల్లల్ని కనేది మీరైనా ప్రసవవేదన మాత్రం పురుషులికనుంచే అనుభవిస్తారు" అని అంతర్ధానమయ్యాడు. ఆనాడు ఆడవాళ్లందరూ అవధిలేని ఆనందసాగరంలో ఆటుకున్నారు.

మొట్టమొదట రాణీగారి వంతు వచ్చింది. నవమాసాలు దగ్గరపడినై. ఇంక రాజుగారికి భయముపట్టుకుంది. రాజు తన హంసతూలికా తల్పంబుపై మేనువాల్చాడు. చుట్టూవైద్యులు, కాదు కాదు వైద్యశిఖామణులు పరివేష్టించారు రాజుగారి బాధ నివారించడానికి. ఆ మందిరంలో ఒక పెద్దగంట ఏర్పాటు చేసారు. రాణీగారు ప్రసవించిన వెంటనే ఆ గంట మ్రోగేటట్లు కూడా ఏర్పాటుచేసారు. రాజు మానసికబాధ వర్ణనాతీతం. ఎలాగుంటయో నొప్పులు? కడుపునొప్పిపెడుతుందేమో! తలనొప్పిపెడుతుందేమో! క్షణ క్షణానికి తనవళ్లు తడుముకొని బాధపడుతున్నాడు. గుండెలు గుబగుబలాడుతుంటే చిక్కపట్టుకొని కూర్చున్నాడు. ఇంతలో గంటమ్రోగింది. ఓహో! రాణీగారికి సుఖం ప్రసవం కాబోలు అని అనుకున్నాడు రాజుగారికి వీసమెత్తు బాధ లేకుండగనే రాణీగారు ప్రసవించారు.

రాణీగారు హాయిగా, సుఖంగా పడుక్కొని అప్పుడే ప్రసవించిన శిశువుని చూస్తూ ఆనందిస్తున్నారు. ఇంతలో చెలికత్తె పరుగెత్తుకొని వచ్చింది. "అమ్మా! అమ్మా! మన గుర్రపుబండీ తోలే గుర్రయ్య చాలా బాధపడుతున్నాడమ్మా ఇందాకటనుంచీ! కడుపుపట్టుకొని పొర్లిపొర్లి యేడుస్తున్నాడు. ఆపసోపాలు పడుతున్నాడు. మన రాజవైద్యులకి చూపిద్దామా?" అని అడిగింది ఇంతి. రాణీగారికి చటుక్కున తెలివివచ్చింది. ఏదో ఏదో జ్ఞాపకమొచ్చింది. తన మెడలోని రత్నాల హారాన్ని దాసిపై విసరింది. "ఇదుగో! ఇంతే! గుర్రయ్యను ఎవ్వరికీ తెలియకుండా వాడి యింటికి తీసుకవెళ్ళు. ఇప్పుడు నాతో చెప్పిన విషయాన్ని ఇంకెవరికి తెలియనీయక వెళ్ళు! ఇంతి రత్నహారాన్నికళ్లకద్దుకుంటూకదిలింది.

రాణీ, తదితరస్త్రీలు తమసమస్యను తిరిగి చర్చించారు. భగవంతునిదగ్గరకు బయలుదేరాడు. "మహాప్రభూ! సుఖంలాగే కష్టంకూడ ఒక ఉదాత్తమైన అనుభూతి అని గ్రహించాం. కష్టానికి ఉన్న విలువ తెలుసుకున్నాం. కష్టంలేని ప్రసవం మాకొద్దు ఇకనుంచీ మునుపటిలాగే మేమే ప్రసవ వేదన అనుభవించేటట్లు అనుగ్రహించండి స్వామీ!" అని ప్రార్థించారు.

భగవంతుడు భక్తవత్సలుడు కాదంటాడా?

"అలాగే!" అని అంతర్ధానమయ్యాడు.

★